క్లుప్తంగా

బకాయి వేతనాలు చెల్లించాలి



వర్ని: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే కాంట్రాక్టు వర్కర్ల నాలుగు నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని శుక్రవారం తెలంగాణ హాస్పిటల్స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. వేతనాలు ఇవ్వకపోవడంతో వారికి కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేల చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ వర్ని ఏరియా అధ్యక్షురాలు సుశీల, ప్రధాన కార్యదర్శి సావిత్రి, కోశాధికారి బాల ప్రసాద్, ఉపాధ్యక్షులు కొండాబాయి, సహాయ కార్యదర్శి బాలమణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరిక



మోర్తాడ్: తిమ్మాపూర్‌కు చెందిన ఎంపీటీసీ ఆస్మా, బీఆర్ఎస్ యువజన సంఘం నాయకుడు అజారోద్దీన్, ఇతర నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని భావించి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

ఎన్నికల అధికారుల నియామకం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం సరసం చిన్నారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులుగా గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్‌లను నియమించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు జగన్, కోశాధికారి అరుణ్, సంయుక్త కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన కలిగోట గంగాధర్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ బీజేపీ అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా కలిగోట గంగాధర్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోషణ పక్షోత్సవాలు

నందిపేట్ (ఆర్మూర్): పోషణ పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం నందిపేట్ సెక్టార్ వెల్మల్ గ్రామ అంగన్వాడీ స్కూల్‌లో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులందరికి పోషక విలువలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఎస్‌డీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ రేఖ, ఎంపీటీసీ మీనా, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, పీహెచ్ఎన్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎం, ఆశాలు, ఆయాలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల ధర్నా



నవీపేట : పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు శుక్రవారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈవో గణేష్ రావ్‌కు అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు నరేష్ కుమార్, శ్రీనివాస్, గంగామణి, లింగం పాల్గొన్నారు.

ఓటరు ప్రతిజ్ఞ

పెర్కిట్(ఆర్మూర్): రానున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల నుంచి జాతీయ రహదారుల కూడలి వరకు ర్యాలీగా బయలుదేరి మానవ హారంగా ఏర్పడ్డారు. అనంతరం ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవి కుమార్, అనంతరావు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- పట్టించుకోని జీపీ సిబ్బంది
- ఖర్చు చేసిన నిధులు మొత్తం వృథా



ఏర్గట్లలో పిచ్చి మొక్కలతో ఉన్న క్రీడా ప్రాంగణం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. అక్కడ సరైన రక్షణ చర్యలు, వసతి సౌకర్యాలు లేవు. క్రీడా సామగ్రి ఎక్కడ పెట్టాలో తెలియక ప్రాంగణాన్ని వృథాగా వదిలేశారు. క్రీడా ప్రాంగణం వినియోగంలో లేకపోవడంతో గడ్డి మొలిచి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ప్రాంగణం కోసం ఖర్చు చేసిన రూ.75వేలు బూడిదలో పోసిన పన్నీరైంది. ఇది ఒక్క ఏర్గట్ల క్రీడా ప్రాంగణం పరిస్థితే కాదు. జిల్లాలోని అనేక గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇలాగే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన క్రీడా ప్రాంగణాలను పట్టించుకునేవారు లేక అవి అలంకార ప్రాయంగానే మారిపోయాయి. క్రీడా ప్రాంగణాలు ఎక్కువ చోట్ల గ్రామానికి దూరంగా ఉండటం, సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. 2022లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రాంగణాలను ఆరంభించారు. ప్రతి జీపీ పరిధిలో ఒక ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ నిధులతో ఒక్కో ప్రాంగణం కోసం రూ.75 వేల వరకు ఖర్చు చేశారు. క్రీడా సామగ్రి కొనుగోలు కోసం మరో రూ.10వేలు ఖర్చు చేశారు. గ్రామాలలోని యువత క్రీడల్లో శిక్షణ పొందడం, వ్యాయామం కోసం ఈ ప్రాంగణాలను వినియోగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. కానీ ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. ఈ ప్రాంగణాలను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. యువత కోసం ఈ ప్రాంగణాలు ఎంతో మేలు చేసేవిగా ఉన్నాయి. గ్రామ పంచాయతీలు స్పందించి క్రీడా ప్రాంగణాలను ఆధునీకరించాలి. సరైన వసతులు కల్పించి, సామగ్రిని అందుబాటులో ఉంచాలి. – వినీత్ కుమార్ గౌడ్, మోర్తాడ్

ప్రభుత్వానికి విన్నవిస్తాం



క్రీడా ప్రాంగణాలను వినియోగించే విషయంలో ప్రభుత్వానికి విన్నవిస్తాం. ప్రతి యువతీ యువకులు ఈ ప్రాంగణాలను వినియోగించుకుని పోలీసు, ఇతరత్రా యూనిఫాం ఉద్యోగాలను దక్కించుకోవాలి. ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించి ప్రాంగణాలను ముస్తాబు చేయిస్తాం. – జక్కం అశోక్, కాంగ్రెస్ నేత, మోర్తాడ్

'మరో రకం విత్తనం అంటగట్టారు'



కోటగిరిలో ఆందోళన చేస్తున్న రైతులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని గ్రోమోర్ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. గంగా కావేరి పేరు చెప్పి మరో రకం విత్తనం అంటగట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో చేతికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు పొట్ట దశకు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రోమోర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యపై విచారణ చేశామని, గంగాకావేరి స్వల్పకాలిక రకం విత్తనం ఇవ్వాల్సి ఉండగా దీర్ఘకాలిక రకం రైతులకు వచ్చిందని అన్నారు. కంపెనీ యాజమాన్యంతో చర్చించి రైతులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నెలాఖరులోపు బిల్లులు చెల్లించాలి



వర్ని: అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజలు ఈ నెల ఆఖరిలోగా పంచాయతీ బిల్లులు చెల్లించాలని వర్ని ఎంపీవో చందర్ నాయక్ కోరారు. శుక్రవారం జాకోరాలో బిల్లుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలో ఉన్న 22 గ్రామ పంచాయతీలలో నేటి వరకు 12 పంచాయితీలలో 100 శాతం బిల్లులు వసూలు చేశామని, మిగతా గ్రామ పంచాయతీల్లో ఈ నెల ఆఖరి వరకు వంద శాతం వసూళ్లు చేపడతామని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

పిచ్చికుక్కల బెడద నివారించాలి



వేల్పూర్: పిచ్చికుక్కల బెడద నివారించాలని శుక్రవారం జరిగిన వేల్పూర్ మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపీపీ బీమ జమున అధ్యక్షతన నిర్వహించిన మండల సభలో సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పిచ్చి కుక్కల వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు బిక్కుబిక్కుమంటూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టి పిచ్చికుక్కల బెడద నివారించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయాధికారి సంతోషరెడ్డి మాట్లాడుతూ.. పశువులు జొన్నలాప తింటే చనిపోయే ప్రమాదం ఉంటుందని, దానిని తినకుండా జాగ్రత్త పడాలన్నారు. పలు సమస్యలు సభలో ప్రస్తావించారు. బదిలీపై వెళ్లిన ఎంపీడీవో కమలాకర్, నూతనంగా వచ్చిన ఎంపీడీవో బాలకిషన్‌ను సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, ఎంపీఈవో జావేద్‌హైమద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం



ఆర్మూరటౌన్: పట్టణంలో శుక్రవారం ఆర్మూర్ మండల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ మండల వినియోగదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సింహయ్య, బొచ్కర్ దత్తాద్రిలు మాట్లాడారు. సేవల విషయంలో సమస్య తలెత్తినపుడు ఫిర్యాదు చేయాలని, కేసును 90 రోజుల్లోగా పరిష్కరించడానికి వీలుందని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మదనపల్లిలో టీకాలు వేస్తున్న అధికారి కిరణ్

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో మండల పశు సంవర్ధక శాఖ అధికారి లక్కం ప్రభాకర్, వైద్య సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్, రాధ, దివ్య, నాగార్జున, గోపాల మిత్రలు సురేష్, రాజన్న పాల్గొన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మదన్‌పల్లిలో శుక్రవారం స్థానిక ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పశువైద్యాధికారిణి ఉమా సహేర్, పంచాయతీ ప్రత్యేక అధికారిణి పద్మ, పశువైద్య సిబ్బంది వినీత, ఎండీ అహ్మద్‌పాషా, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిపై దాడి

ఎడపల్లి(బోధన్): అంబం(వై) జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌పై శుక్రవారం దాడి జరిగింది. అంబం (వై) గ్రామానికి చెందిన పవన్ తన వీధిలో లైట్ రావడం లేదంటూ ఫిర్యాదు చేయడానికి కార్యదర్శి దగ్గరకు వెళ్లారు. రెండు రోజులలో చేయిస్తానని శ్రీనివాస్ చెప్పారు. దీంతో పవన్ దుర్భాషలాడుతూ కార్యదర్శిని కొట్టే ప్రయత్నం చేశాడు. కార్యదర్శిపై కుర్చీ విసిరేయడంతో గాయపడ్డాడు. అంతేకాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇదంతా ఎడపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గోపాలకృష్ణ ముందే జరిగింది. దీంతో ఎంపీడీవో గోపాలకృష్ణ, కార్యదర్శుల సంఘం సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పేదల గుడిసెలకు ఇంటి నంబర్లు ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యానం గుట్ట వద్ద పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్యలు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో యానం గుట్ట సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ షేక్ మున్నుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షాహిదా బేగం, కుల్దీప్ శర్మ, చిన్నయ్య పాల్గొన్నారు.

రూ.2.40 లక్షలకు తై బజార్ వేలం

వర్ని: మోస్రా మండల కేంద్రంలో తై బజార్ వేలం శుక్రవారం నిర్వహించగా రూ.2.40లక్షలకు లింగం అనే వ్యక్తి వేలంలో పొందినట్టు పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ వెల్లడించారు. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి ఈ వేలం వర్తిస్తుందని ఆయన చెప్పారు.

సమాచారం..

18న వాహనాల వేలం పాట

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 18న ద్విచక్ర వాహనాలను వేలం పాట వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. ఆరు ద్విచక్ర వాహనాలను వేలం పాట వేస్తున్నామని, ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

బోధన్: పట్టణ కేంద్రంలోని డివిజన్ ఉప విద్యాధికారి కార్యాలయం ముందు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ) ఆవరణలో ఒకినోవా కరాటే సంస్థ ఆధ్వర్యంలో బాల బాలికలకు ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఆ సంస్థ మాస్టర్ అశోక్ కుమార్ రోడే శుక్రవారం తెలిపారు. ఏడేళ్ల నుంచి 21 ఏళ్ల వయస్సు కలిగిన బాల బాలికలకు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. వచ్చే ఏప్రిల్ 21 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఆసక్తి కలిగిన బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9848121160 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పసుపు బోర్డు ఏర్పాటుతో మంచి ధర



మాట్లాడుతున్న బీజేపీ నేత తిరుపతి రెడ్డి

బాల్కొండ: పసుపు బోర్డు ఏర్పాటుతోనే ప్రస్తుతం మంచి ధర(రూ.20 వేలు) వచ్చిందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పసుపు బోర్డు గెజిట్ విడుదలైనా పసుపు బోర్డు ఏర్పాటు కాలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎంపీ అర్వింద్ కృషితో స్వయంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేశారన్నారు. జగిత్యాల్‌లో నిర్వహించే ప్రధాని మోదీ సభకు పసుపు రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మోదీ, అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు అంబటి నవీన్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఉంటేనే పనులు జరుగుతాయని ఇన్‌చార్జి చైర్మన్ షేక్ మున్ను అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో 38 అంశాలకు గాను 36 అంశాలు ఏకగ్రీవంగా తీర్మానించారు. రెండు అంశాలను వాయిదా వేసినట్లు తెలిపారు. 36 వార్డులలో ఒక్కొక్క వార్డుకు రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించి అత్యవసర పనులు చేపట్టనున్నట్లు చైర్మన్ చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో అక్రమంగా ఇంటి నెంబర్లు ఇచ్చారని కొంతమంది కౌన్సిలర్‌లు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. వాటిని పరిశీలించి విచారణ చేస్తామన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి:బీజేపీ

ఆర్మూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపాలని, రూ.84 లక్షల డీజిల్ బిల్లు, గ్రీన్ బడ్జెట్ కుంభకోణంపై విజిలెన్స్ అధికారులు విచారణ జరపాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఇరిగేషన్, అసైన్డ్ భూములలో కేటాయించిన ఇంటి నెంబర్లపై విచారణ చేయించాలన్నారు.

తైక్వాండో శిక్షణకు సహకరించిన మహిళలకు సన్మానం



బోధన్: జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిజామాబాద్ నగర కేంద్రంలో 11 వేల మంది విద్యార్థినులతో తైక్వాండో(స్వీయ ఆత్మరక్షణ) శిక్షణ కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొనేందుకు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వచ్చేందుకు కృషి చేసిన మహిళా పోలీస్ సిబ్బంది, పీఈటీలు, ఏఎన్ఎంలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం బోధన్ కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు వారి ఘనంగా సన్మానించి అభినందించారు. ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివసాయి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మోస్రా జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి

వర్ని(మోస్రా): మండలంలోని చే నెంబర్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మోస్రా జెడ్పీటీసీ విజయ భాస్కర్ రెడ్డి భూమి పూజ చేశారు. రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

దేవునిగుట్ట తండాలో..

రుద్రూర్: కోటగిరి మండలం దేవునిగుట్ట తండాలో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణా రెడ్డి, రవి, యశ్వంత్, కిషన్, గుర్నాథ్ పాల్గొన్నారు.

మోర్తాడ్ మండల కేంద్రంలో..

మోర్తాడ్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి మంజూరు చేయించారని, ఈ నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

ఏర్గట్ల మండల కేంద్రంలో..

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 లక్షల నిధులను కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి మంజూరు చేయించగా ఈ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, నాయకులు జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్ (ఆర్మూర్): పట్టణ కేంద్రంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.15 లక్షలతో వెంకటేశ్వరకాలనీలో పనులను ప్రారంభించామని మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ తెలిపారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దమ్మయి శ్రీను, మండల మైనార్టీ అధ్యక్షులు యూసఫ్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు ఎడ్డీగారి నిఖిల్ ఉన్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం



బాల్కొండ: కిసాన్‌నగర్ దుబ్బలోని ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదిని శుక్రవారం ఎంపీపీ యామగంటి లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్యలు ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్, ఎంపీటీసీ రామరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) - 10.25
	సైతాన్ (హిందీ) - 1.15, 7.00
	బాబు (తెలుగు) - 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) - 12.30, 3.35, 6.40, 9.45

సంక్షిప్తం

కార్పొరేషన్ ఏర్పాటుపై గంగపుత్రుల హర్షం

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్రులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల జిల్లా మత్స్యకార సహకార సంఘం తాత్కాలిక కమిటీ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం అర్సపల్లిలో పాత మత్స్యకార శాఖ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. చీఫ్ ప్రమోటర్ కస్ప శ్రీనివాస్, నారాయణ, బోర్గాం శ్రీను, నర్సన్న, రమేశ్, బాలన్న, సునీల్, తదితరులున్నారు.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో సంబురాలు

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ ప్రభుత్వం కమ్మ కార్పొషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు కమ్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం ప్రతినిధులు మాట్లాడారు. కమ్మ సంఘం ప్రతినిధులు సునీల్‌కుమార్ చౌదరి, సావులూరి వెంకటేశ్వర్‌రావ్, గాంధీ, శ్రీనివాస్‌రావ్, తదితరులు ఉన్నారు.

గోదాముల నిర్మాణానికి తీర్మానం

నవీపేట: బినోల సొసైటీ పరిధిలోని పలు గ్రామాలలో గోదాములను నిర్మించాలని శుక్రవారం జరిగిన మహాజన సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి తీర్మానాలు చేశారు. బినోల గ్రామంలో నూతనంగా కల్యాణ మండపాన్ని నిర్మించాలని తీర్మానం చేశారు. నాడాపూర్, తుంగిని, సిరన్ పల్లి, గాంధీనగర్‌లలో గోదాములను నిర్మించాలని తీర్మానించారు. చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, డైరెక్టర్లు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాల పరిశీలన

రుద్రూర్: కోటగిరి మండలం రాంపూర్, కోటగిరి గ్రామాల్లో ప్రభుత్వ పథకాల వినియోగంపై శుక్రవారం ఎంపీడీవో మనోహర్ రెడ్డి క్షేత్ర పరిశీలన చేశారు. బీసీ కార్పొరేషన్ ఆర్థిక చేయూత పథకం కింద అందచేసిన రుణాన్ని లబ్ధిదారులు ఎలా వినియోగించుకుంటున్నారని ఆరా తీశారు.

శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలి

పెర్కిట్(ఆర్మూర్): దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆర్మూర్ సబ్ యూనిట్ అధికారి సాయి అన్నారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ వారానికి ఒకసారి నీటి నిలువలను పూర్తిగా తొలగించి ఆరబెట్టాలన్నారు. ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాధవి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని మాధవి ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన తినుబండారాలను తీసుకువచ్చి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శన చేసి విక్రయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి, సురేష్‌లు మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జంక్ ఫుడ్‌ను నిషేధించి మంచి ఆహారపు అలవాట్లను చేసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.